మోడల్ స్కూల్‌లో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానం

కలెక్టరేట్ : జిల్లాలో గల నాలుగు ఎపి మోడల్ స్కూళ్లలో ఆరో తరగతి ప్రవేశాల కోసం విద్యాశాఖ దరఖాస్తు లు ఆహ్వానిస్తున్నది. ఆసక్తి గల విద్యార్థుల తల్లిదండ్రులు https/apms.ap.gov.in.apms ఆన్‌లైన్‌లో అప్లై చేసుకోవాలి. ఎపి మోడల్ స్కూల్ కురుపాం 91823 97359, ఏపీ మోడల్ స్కూల్ భామిని 91 94403 22964, ఏపీ మోడల్ స్కూల్, మక్కువ 70329 96553, ఏపీ మోడల్ స్కూల్ సాలూరు 6303631719 నందు ప్రవేశాలకు ఎస్‌సి, ఎస్‌టి విద్యార్థులకు రూ.75, ఇతర విద్యార్థులు రూ.150 ఫీజు చెల్లించాలి. దరఖాస్తులను ఈనెల 9నుంచి 25 వరకు ఆన్లైన్ లో పైన తెలిపిన వెబ్ సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. పరీక్ష జూన్6న ఉదయం 10గంటల నుంచి 12 గంటల వరకు నిర్వహిస్తారు. మరింత సమాచారం కోసం సంబంధిత మోడల్ స్కూల్ ప్రిన్సిపల్, మండల /జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయం యందు సంప్రదించవచ్చు.

టెన్త్ ఫలితాల్లో

- బాలికలదే పైచేయి
- 57 ప్రభుత్వ పాఠశాలలు నూరుశాతం ఉత్తీర్ణత
- జిల్లా ఏర్పడిన తొలి ఏడాదిలోనే విద్యాశాఖ అత్యుత్తమ ప్రతిభ

దివ్యశ్రీ (594)

హర్షిని (593)

అస్మిత (590)

ప్రభుత్వ పాఠశాలలో జిల్లా టాపర్ హేమలతను (587) అభినందిస్తున్న డిఇఒ, అధికారులు; పక్కన తబిత (586), తనుశ్రీ (585)

కలెక్టర్ అభినందనలు

కలెక్టరేట్: టెన్త్ ఫలితాల్లో జిల్లా ప్రథమ స్థానంలో రావడం పట్ల కలెక్టర్ నిశాంత్‌కుమార్ ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులకు జిల్లా కలెక్టరు శుభాకాంక్షలు తెలిపారు. మంచి ఫలితాలు సాధించి, రాష్టంలో మొదటి స్థానం సాధించడంలో పాటుపడిన ఉపాధ్యాయులు, అధికారులను అభినందించారు. పరీక్షలలో తప్పిన విద్యార్థులు నిరాశకు గురికాకుండా సప్లమెంటరీ పరీక్షలకు సిద్దంకావాలని తెలిపారు.

ప్రజాశక్తి–పార్వతీపురంరూరల్

పదో తరగతి పరీక్షా ఫలితాల్లో పార్వతీపురం మన్యం జిల్లా విద్యార్థులు సత్తాచాటారు. రాష్ట్రంలో నెంబర్ వన్‌గా నిలిచి జిల్లాకు పేరు తెచ్చారు. 87.47 శాతం ఉత్తీర్ణత సాధించి రాష్ట్రంలో ప్రథమస్థానంలో నిలిచి చరిత్రకెక్కారు. ఈ ఫలితాల్లో బాలికలే సత్తా చాటారు. జిల్లా ఏర్పడిన 13 నెలలకే ఇంతటి విజయాన్ని ఒడిసిపట్టడానికి కారకులైన కలెక్టర్ నిషాంత్‌కుమార్‌తో పాటు జిల్లా విద్యాశాఖకు చెందిన అధికారుల కృషికి జిల్లా వాసులు, విద్యార్థుల తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. పరీక్షలకు జిల్లా నుంచి 10689 మంది విద్యార్థులు హాజరవ్వగా, 9350మంది ఉత్తీర్ణులయ్యారు. వీరిలో 5255మంది బాలురుకు 4518మంది ఉత్తీర్ణత సాధించగా, 5434 మంది బాలికలకు 4832మంది ఉత్తీర్ణత సాధించారు. పాలకొండ పట్టణంలోని తమ్మినాయుడు పాఠశాల విద్యార్థిని శాశపు దివ్యశ్రీ 594 మార్కులు సాధించి జిల్లా టాపర్‌గా నిలిచింది. అలాగే శివ్వాల హర్షిణి 593 మార్కులు, కె.అస్మిత 590, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచారు. అలాగే ప్రభుత్వ పాఠశాలలకు సంబంధించి అత్యధికంగా పాలకొండ ప్రభుత్వ పాఠశాలకు చెందిన పి.హేమలత 587 మార్కులతో ప్రథమ స్థానం, దుద్ది తబిత 586మార్కులతో రెండో స్థానం, కురుపాం మోడల్ స్కూల్ విద్యార్థి కర్రి తనుశ్రీ, సాలూరు ఎన్‌జెబి రెసిడెన్షియల్ స్కూల్ విద్యార్థి కర్రి షర్మిల 585మార్కులతో తృతీయ స్థానం సాధించారు. రాష్ట్ర ఉత్తీర్ణత శాతం 72.26 కాగా, పార్వతీపురం మన్యం జిల్లా 87.47 శాతం విజయం నమోదు చేయడం విశేషం. ఇందులో ప్రభుత్వ పాఠశాలలు మెరుగైన ఫలితాలను సాధించాయి.

అవమానం జరిగిన కొద్దికాలానికే అగ్రస్థానం

ఈ విజయం సాధారణమే అయినప్పటికీ ప్రత్యేకించి పార్వతీపురంమన్యం జిల్లాలో గత నెలలో జరిగిన సంఘటన వల్ల ఈ విజయం ప్రత్యేకం అనిచెప్పవచ్చు. గత నెలలో పార్వతీపురం మన్యం జిల్లాలో ఒకటి, రెండు పాఠశాలలు సందర్శించిన రాష్ట్ర విద్యాశాఖకు చెందిన ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రవీణ్ ప్రకాష్ "మానిటరింగ్ సరిగా లేదని సాకు చూపి" జిల్లా విద్యాశాఖ అధికారితో పాటు కొంతమంది అధికారులను, ఉపాధ్యాయులను సస్పెండ్ చేశారు. ఈ సంఘటనతో మనస్థాపం చెందిన ఉపాధ్యాయ సంఘాలు జిల్లా కేంద్రంలో పెద్దఎత్తున నిరసనలు చేపట్టాయి. స్పందించిన ముఖ్యమంత్రి, విచారణ జరిపి, వారికి న్యాయం చేయాలని చెప్పడం జరిగింది. సస్పెండ్‌కు గురిఅయిన డిఇఒ, మిగతా ఉపాధ్యాయులు ఇంకా విధుల్లోకి తీసుకోక మునుపే శనివారం విడుదలైన పదవతరగతి ఫలితాల్లో రాష్ట్రంలోనే మొదటి స్థానంలో మన్యం జిల్లా నిలవడంతో వారి చిత్తశుద్ధి తేటతెల్లవమైంది. దీంతో ప్రవీణ్ ప్రకాష్ తనిఖీల్లో శాస్త్రీయత లేదని, అధికారులు, ఉపాధ్యాయులపై వారు తీసుకున్న చర్యలన్నీ అక్రమమేనని, కక్ష సాధింపు చర్యలేనని చెప్పకనే చెప్పినట్లైంది. రాష్ట్ర ప్రభుత్వం ఇకనైనా ఇలాంటి కక్ష సాధింపు చర్యలు మానుకొని 3,4,5 తరగతుల విలీనం నిలుపుదల చేసి, జీవో నెంబర్ 117 ను రద్దుచేసి ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి తోడ్పడాలని జిల్లాకు చెందిన పలు ఉపాధ్యాయ సంఘాలు, ప్రజాసంఘాలు డిమాండ్ చేస్తున్నాయి.

ఉపాధ్యాయులు, అధికారుల కృషే కారణం : యుటిఎఫ్

కలెక్టరేట్: పదో తరగతి ఫలితాల్లో మన్యం జిల్లా మొదటి స్థానంలో నిలబడడానికి ప్రధాన కారణం ఉపాధ్యాయులు అధికారులేనని యుటిఎఫ్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు టి. రమేష్, ఎస్ మురళీమోహనరావు తెలిపారు. మన్యం జిల్లాలో పదో తరగతి ఉత్తర్వత శాతం 87.4 సాధించడానికి ఉపాధ్యాయులు, అధికారులు రాత్రీపగలు అన్న తేడా లేకుండా అనునిత్యం కృషి చేశారని తెలిపారు. జిల్లాలో 57 పాఠశాలల్లో 100శాతం ఉత్తీర్ణత సాధించినట్టు తెలిపారు. వీటిలో పది పాఠశాలలు వందశాతం, 47 ప్రభుత్వ గిరిజన ఆశ్రమ పాఠశాలలు శతశాతం ఉత్తీర్ణత సాధించాయన్నారు. 87.4 శాతం సాధించడానికి ఉపాధ్యాయులతో పాటు జిల్లా విద్యాశాఖ అధికారి సూచనలు, పర్యవేక్షణ కూడా కారణమని అన్నారు. కావున డిఇఒ, ఇతర అధికారులను సస్పెన్షన్‌ను వెంటనే ఎత్తివేయాలని యుటిఎఫ్ డిమాండ్ చేసింది.

జిల్లా ఫస్ట్ విద్యార్థులకు డిఇఒ సన్మానం

పాలకొండరూరల్ : ప్రభుత్వ పాఠశాలలో చదివి జిల్లాలో పదవ తరగతిలో ప్రథమ స్థానం సాధించిన హేమలత, దుడ్డి తబితను జిల్లా విద్యాశాఖ అధికారి ఎన్. ప్రేమ్ కుమార్ శనివారం వారి గృహానికి వెళ్లి కలిసి అభినందించారు. కార్యక్రమంలో డిప్యూటీ డిఇఒ విజయ కుమారి, ఎంఇఒ సూర్య నారాయణ, ఎపిఒ శంకనరావు పాల్గొన్నారు

జిల్లాలో 7865 మంది విద్యార్థులు ప్రథమ శ్రేణిలో, 1151 మంది విద్యార్థులు ద్వితీయ శ్రేణి లో, 334 మంది విద్యార్థులు తతీయ శ్రేణి లో మంది పాస్ అయినట్లు డిఇఒ ఎతెలిపారు. జిల్లాలో 57 పాఠశాలలు నూరుశాతం ఉత్తీర్ణత సాధించాయన్నారు. 1338 మంది విద్యార్థులు ఫెయిల్ అయ్యారని తెలిపారు. 25 మంది విద్యార్థులు ఆబ్సెంట్ అయ్యారని, ఒకరు విత్ హెల్డ్ అయ్యారని తెలిపారు. సాంఘిక సంక్షేమ హాస్టళ్లకు చెందిన 72 మంది విద్యార్థులు, బిసి సంక్షేమ హాస్టళ్లకు చెందిన 113 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించగా వారిలో వరుసగా 61 మంది (84.72 శాతం), 106 మంది (93.86 శాతం) ఉత్తీర్ణులయ్యారు. 2,273 మంది గిరిజన సంక్షేమ పాఠశాలలకు చెందిన విద్యార్థులు పరీక్ష రాయగా 2,134 మంది (93.88 శాతం) ఉత్తీర్ణులయ్యారు. 54 పాఠశాలల్లో 24 గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలు వంద శాతం ఫలితాలు సాధించాయి. గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లో 1853 మంది విద్యార్థులు ప్రథమ శ్రేణిలో, 236 మంది విద్యార్థులు ద్వితీయ శ్రేణి, 45 మంది తతీయ తరగతిలో ఉత్తీర్ణత సాధించారు. దోనుబాయి ఆశ్రమ పాఠశాలకు చెందిన పాలక గురునాథ్ 571 మార్కులు సాధించి విద్యార్థుల్లో ప్రథమ స్థానంలో నిలిచారు. ఆయన సీతంపేట మండలం కుసుమ గ్రామానికి చెందినవారు. ఆయన తండ్రి ఉమా మహేశ్వరరావు వ్యవసాయ కూలి.

సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ప్రత్యేకాధికారి రవిచంద్ర

పథకాలకు పేదలు దూరం కాకూడదు

జిల్లా ప్రత్యేకాధికారి రవిచంద్ర

ప్రజాశక్తి - పార్వతీపురం

పేదలు ప్రభుత్వ పథకాలకు దూరం కాకుండా చూడాలని జిల్లా ప్రత్యేక అధికారి ఎం.రవిచంద్ర అన్నారు. జిల్లా పర్యటనకు శనివారం విచ్చేసిన ఆయన కలెక్టరేట్ సమావేశ మందిరంలో ప్రభుత్వ పథకాలపై జిల్లా కలెక్టరు, జిల్లా అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. వైద్య ఆరోగ్యం, మహిళా శిశు సంక్షేమం, పంచాయతీరాజ్, స్పందన, జగనన్నకు చెబుతాం, మొబైల్ టవర్స్, వ్యవసాయం, ఉద్యానశాఖ, నాడు–నేడు,రీసర్వే పథకాలపై సమీక్ష నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జిల్లాలో ప్రభుత్వ పథకాల అమలుకు, అభివృద్ధికి కావాల్సిన సహకారం గురించి తెలియజేస్తే రాష్ట్ర స్థాయి అధికారులతో మాట్లాడి పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. ఆధార్ కార్డు, బ్యాంకు అకౌంటు లేకపోవడం వల్ల చాలా మంది పేదలు ప్రభుత్వ పథకాలను పొందలేకపోతున్నారని, కావున ప్రతి ఒక్కరికీ బ్యాంకు అక్కౌంటు, ఆధార్ నెంబరు ఉండేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఎవరికైనా ప్రభుత్వ పథకాలు అందకపోతే అందుకు గల కారణాలు తెలుసుకోవాలని, వారికి పథకాలు అందించాలని తెలిపారు. గర్భిణులు, పిల్లల్లో రక్తహీనత లేకుండా చేసేందుకు వారికి వైద్య సేవలు, పౌష్టికాహారం అందించేందుకు వైద్య, ఆరోగ్య శాఖ, శిశు సంక్షేమ శాఖలు సమన్వయంతో పనిచేయాలని తెలిపారు. వారి వద్ద గల డేటాను పంచుకొని సరిచూసుకోవాలన్నారు. ఆ డేటా ప్రకారం ఏ ఒక్కరూ మిగిలిపోకుండా పిల్లలందరికీ టీకాలు, పౌష్టికాహారం అందించాలన్నారు. ప్రభుత్వ శాఖలు తమ వద్ద గల గణాంకాలను ఇతర శాఖలతో సరిచూసుకోవాలని తెలిపారు. జిల్లాకు మంజూరైన వెల్‌నెస్ సెంటర్లను పూర్తిగా నిర్మించాలని, వాటి నిర్మాణంలో గల ఇబ్బందులు, ఆర్థిక వనరులపై నివేదిక అందించాలని తెలిపారు. గ్రామీణ, మన్యం ప్రాంతాల్లో ప్రజలు వైద్య సహాయం కోసం పూర్తిగా ప్రభుత్వాసుపత్రులపై అధారపడతారని, కావున వైద్యులు ఎల్లవేళలా అందుబాటులో ఉండాలని తెలిపారు.

జిల్లా కలెక్టరు నిశాంత్ కుమార్ జిల్లా ప్రగతిని పవర్ పాయింటు ప్రజెంటేషను ద్వారా తెలిపారు. హౌసింగ్‌కు సంబంధించి జిల్లాకు 24,743 ఇళ్లు మంజూరు కాగా 40శాతం ఇళ్లు పూర్తిచేసి రాష్ట్రంలో రెండో స్థానంలో నిలిచినట్లు జిల్లా కలెక్టరు తెలిపారు. ఇళ్ల కట్టుకొనేందుకు ప్రభుత్వం నుంచి సహాయం అందిస్తున్నామని, స్వయం సహాయక సంఘాల సభ్యులకు అదనపు రుణం అందిస్తున్నట్లు తెలిపారు. మహిళా శిశు సంక్షేమ శాఖ ద్వారా తక్కువ బరువు గల పిల్లలు, రక్తహీనత గల గర్భిణులందరికీ పౌష్టికాహారం అందిస్తున్నట్టు తెలిపారు. జిల్లాకు 196 వెల్ నెస్ సెంటర్లు మంజూరు కాగా మారుమూల ప్రాంతాల్లో గల గ్రామాల్లో 96 గ్రౌండింగు చేయాల్సి ఉందన్నారు. స్పందన కార్యక్రమంలో అర్జీదారులతో అధికారులు నేరుగా మాట్లాడి వారి సమస్యలను పరిష్కరిస్తున్నట్టు తెలిపారు. ఫిర్యాదుల్లో 75శాతం రెవెన్యూశాఖకు సంబంధించినవే వస్తున్నాయని, కావున మండల స్థాయిలో రెవెన్యూ డివిజనల్ అధికారులు ప్రత్యేక రెవెన్యూ స్పందన కార్యక్రమం నిర్వహించి మండల స్థాయిలోనే సమస్యలను పరిష్కరిస్తే కలెక్టరు కార్యాలయానికి వచ్చే అర్జీలు తగ్గాయని ప్రత్యేకాధికారి సూచించారు. త్వరలో ప్రారంభం కానున్న జగనన్నకు చెబుదాం ప్రత్యేక స్పందన కార్యక్రమం ప్రారంభానికి ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. జిల్లాలో పూర్తిస్థాయిలో మొబైల్ నెట్ వర్కు అందుబాటులోనికి తీసుకువచ్చేందుకు 1312 ఏజెన్సీ గ్రామాల ప్రజలకు ఉపయోగపడేలా 191 సెల్ టవర్లు నిర్మిస్తున్నామని, అక్టోబరు నాటికి నిర్మాణం పూర్తయి పూర్తిస్థాయిలో సేవలు అందుబాటులోనికి వస్తాయని కలెక్టరు తెలిపారు. రైతుభరోసా కేంద్రాల ద్వారా రైతులకు కావాల్సిన ఎరువులు, విత్తనాలు, ధాన్యం సేకరణ సేవలు అందిస్తున్నామని, కస్టమ్ హైర్ సెంటర్లు ద్వారా రైతులకు యంత్ర పరికరాలను అద్దె ప్రాతిపదకన అందించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. జిల్లాలో అకాల వర్షాలకు 213 హెక్టార్ల మొక్కజొన్న, నువ్వుల పంట 291 హెక్టార్ల, అరటి పంటలు దెబ్బతిన్నాయని నష్టపరిహారం కోసం ప్రభుత్వానికి నివేదికలు పంపినట్లు కలెక్టరు తెలిపారు. సమావేశంలో జెసి సి.విష్ణుచరణ్, డిఆర్ఒ జె.వెంకటరావు, ఆర్‌డిఒ కె.హేమలత, జిల్లా పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ అధికారి డా.ఎం.వి.ఆర్.కృష్ణాజీ, డ్వామా, డిఆర్‌డిఎ పీడీలు కె.రామచంద్రరావు, పి.కిరణ్‌కుమార్, జిల్లా ఆర్‌డబ్ల్యుఎస్ ఇంజినీరింగ్ అధికారి ఓ.ప్రభాకర రావు, ఇతర జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ఉపాధి హామీ చట్టాన్ని నిర్వీర్యం చేయొద్దు

ప్రజాశక్తి - సాలూరు

ఉపాధి హామీ చట్టాన్ని నిర్వీర్యం చేయొద్దని కోరుతూ ఈనెల 15న నిర్వహించనున్న ఛలో కలెక్టరేట్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి ఎం.శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. శనివారం స్థానిక సిఐటియు కార్యాలయంలో దీనికి సంబంధించిన కరపత్రాలను ఆయన మండల వ్యవసాయ కార్మిక సంఘం నాయకులతో విడుదల చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎన్నో పోరాటాలతో సాధించుకున్న ఉపాధి హామీ చట్టాన్ని నిర్వీర్యం చేయాలని కేంద్ర ప్రభుత్వం కుట్ర చేస్తోందని అన్నారు. రెండు పూటలా పని విధానంతో కార్మికులను ఇబ్బందికి గురి చేస్తోందని చెప్పారు. కేరళలో రోజువారీ ఉపాధి కూలీలకు రూ.600 చెల్లిస్తూ రాష్ట్ర ప్రభుత్వం చట్టం చేసిందని తెలిపారు. రెండు పూటలా పని విధానం అమలు చేయలేదని చెప్పారు. రాష్ట్రంలో ఇలాంటి చట్టం చేయాలని డిమాండ్ చేశారు. గతంలో పని ప్రదేశాల్లో టెంట్లు, కూలీలకు వేసవిలో మజ్జిగ పంపిణీ జరిగేదని, గాయపడిన వారికి, అస్వస్థతకు గురైన వారికి ప్రథమ చికిత్స చేయడానికి మెడికల్ కిట్లు మంజూరయ్యేవని చెప్పారు. ఇప్పుడు అవేవీ సౌకర్యాలు పని చేస్తున్న ప్రదేశాల్లో లేవని చెప్పారు. పని చేస్తూ మరణించిన కూలీకి రూ.10లక్షలు పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. పని చేసిన కూలీలకు నెలల తరబడి బిల్లులు పెండింగులో వుంటున్నాయని చెప్పారు. వెంటనే బిల్లులు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ కార్మిక సంఘం సభ్యులు సిద్ద సాయిబాబా, కె.అప్పారావు పాల్గొన్నారు.

క్రీడల్లో రాణించాలి

ప్రజాశక్తి - వీరఘట్టం

పంతాలకు పోకుండా క్రీడల్లో రాణించాలని స్థానిక ఎమ్మెల్యే వి.కళావతి క్రీడాకారులకు సూచించారు. ఈ మేరకు శనివారం స్థానిక జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల ఆవరణలో పైడితల్లి అమ్మవారి గ్రామ దేవత ఉత్సవంలో భాగంగా ఉత్సవ కమిటీ, యూత్ కమిటీ సభ్యులు నిర్వహిస్తున్న జిల్లా స్థాయి కబడ్డీ, వాలీబాల్ టోర్నమెంట్ పోటీలు ప్రారంభించిన సందర్భంగా మాట్లాడారు. క్రీడలపై దృష్టి పెట్టి పోటీ పడలే తప్ప ఏ విధమైన ఆలోచనకు గురికాకుండా అందరూ సక్రంగా క్రీడల్లో పాల్గొని ఆమె క్రీడాకారులు సూచించారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ పి.విక్రాంత్, ఎంపిపి డి.వెంకటరమణ నాయుడు, జెడ్‌పిటిసి సభ్యులు జంపు కన్నతల్లి, ఉమామహేశ్వరరావు, పిడిలు, ఉత్సవ కమిటీ ,యూత్ సభ్యులు క్రీడాకారులు పాల్గొన్నారు.

ఏనుగుల కోసం జగనన్నకు చెబుదాం

- పంట నష్టపరిహారం తక్షణమే చెల్లించాలి
- సమస్య పరిష్కారానికి భవిష్యత్తు ఉద్యమ కార్యాచరణ
- అఖిలపక్షం రౌండ్ టేబుల్ సమావేశంలో పలు తీర్మానాలు

ప్రజాశక్తి కలెక్టరేట్

ఏనుగుల సమస్య జగనన్నకు చెబుదామని... అనే సందర్భంలో మే 22న స్థానిక కలెక్టరేట్ వద్ద నిరసన చేపట్టాలని అఖిలపక్ష నేతలు తీర్మానించారు. స్థానిక సుందరయ్య భవనంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు కొల్లి సాంబమూర్తి అధ్యక్షతన రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి సిపిఎం జిల్లా కార్యదర్శి రెడ్డి వేణు, జనసేన నాయకులు వి.దాలినాయుడు, కొమరాడ మండల టిడిపి కన్వీనర్ ఎస్.శేఖర్ పాత్రుడు, కుమ్మరి గుంట సర్పంచ్ గొర్లి లక్ష్మణరావు, సిపిఐ ఎంఎల్ లిబరేషన్ జిల్లా కార్యదర్శి పి.భాస్కరరావు, గుణాపురానికి చెందిన పళ్ల అప్పలనాయుడు, దుగ్గి మాజీ సర్పంచ్ పిచ్చుక కామేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 2017లో ఒడిశా నుంచి ఏనుగులు కురుపాం, పార్వతీపురం, పాలకొండ నియోజకవర్గాల పరిధిలోని మండలాల్లో రాత్రీ పగలు అన్న తేడా లేకుండా స్వైర విహారం చేస్తూ 14 మంది ప్రాణాలను పొట్టన పెట్టుకొని అనేక పశువులను, మేకలను మట్టు పెట్టి, రైతులు పండించిన వివిధ రకాల పంటలు, వ్యవసాయ విద్యుత్తు పంపు సామగ్రి, పంటలను, ఆస్తులను నాశనం చేస్తుంటే సంబంధిత అటవీ శాఖ అధికారులు, ఏనుగుల చుట్టూ రాత్రీపగలు తిరగడమే తప్ప ఫలితం లేదన్నారు. కనీసం పంట నష్టపోయిన రైతులకు, ప్రాణాలు కోల్పోయిన బాధిత కుటుంబాలకు న్యాయం చేయలేదన్నారు. ఇప్పటికీ నష్టపరిహారం చెల్లించకపోవడం అన్యాయమన్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు తక్షణ చర్యలు తీసుకుంటామని చెప్పడమే తప్ప నేటికీ ఏనుగుల బాధ నుండి విముక్తి కలగడం లేదన్నారు. కావున ఏనుగుల సమస్య పరిష్కారానికి భవిష్యత్తు కార్యాచరణ రూపొందించి క్షేత్రస్థాయిలో ఉద్యమం పక్కాగా జరిగేలా కార్యాచరణ రూపొందించాలని తీర్మానించారు. దీనిలో భాగంగా మొదట జగనన్నకు చెబుదాం కార్యక్రమం నుంచి ప్రారంభించి ప్రతి గ్రామంలో ఏనుగుల సమస్య పరిష్కారం చేస్తేనే ప్రజాప్రతినిధులు గ్రామంలోకి రావాలనే నినాదాలు గ్రామ ప్రజల్లోకి తీసుకువెళ్లాలన్నారు. దీనికి అవసరమైన ఫ్లెక్సీలను గ్రామ పొలిమేరల్లో ఏర్పాటు చేయాలన్నారు ప్రతిరోజూ అధికార పార్టీకి చెందిన సర్పంచ్ మొదలుకొని ఎంపి, ఎమ్మెల్యే, మంత్రి వరకు పువ్వులు, ఆకులు అందించి ఏనుగులు సమస్య ప్రతిరోజు గుర్తుచేసేలా కార్యాచరణ రూపొందించాలన్నారు. అలాగే బాధిత కుటుంబాలను పరామర్శించి, వారి బాధలు ప్రజలకు, ప్రభుత్వానికి తెలియజేసేలా ప్రణాళిక రచించాలన్నారు. ప్రతిరోజూ పాలకులకు, ఎస్‌ఎంఎస్‌లు పంపే కార్యక్రమాన్ని రూపొందించాలన్నారు. పరిహారం కోసం పెద్ద ఎత్తున కార్యక్రమాన్ని రూపొందించాలని నిర్ణయించారు. దీనిలో భాగంగా మే 22న కలెక్టరేట్ వద్ద అన్ని పార్టీలు, ప్రజలతో కలిసి వినతి పత్రాలు అందజేత, వీటితో పాటు పలు తీర్మానాలను చేసి, సమస్య పరిష్కారమయ్యేంత వరకు పోరాడాలని నిర్ణయించారు. ఏనుగుల సమస్య పరిష్కారానికి అఖిలపక్ష కమిటీ పలు తీర్మానాలు చేయడం జరిగిందని, వాటిని క్షేత్రస్థాయిలో బాధితుల మద్దతుతో ఉద్యమ రూపానికి తీసుకెళ్తామని తెలిపారు.

సమావేశంలో మాట్లాడుతున్న అఖిల పక్ష నాయకులు

ఎయిర్‌పోర్టు రాజకీయం

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

పబ్లిక్ టాక్

అధికార, ప్రతిపక్షాల ఎత్తుకు పైఎత్తుల నడుమ ఎయిర్‌పోర్టు రాజకీయం సాగుతోంది. భోగాపురం గ్రీన్ ఫీల్డ్ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్టు నిర్మాణానికి ఇటీవల సిఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి శంకుస్థాపన విషయం విధితమే. దీనికి 2019లోనే అప్పటి సిఎం చంద్రబాబు నాయుడు శంకుస్థాపన చేశారని,వైసిపి ఆ పేరుతో ప్రస్తుతం ప్రలిజల్ని హేలన చేయడం సరికాదని జిల్లాకు చెందిన టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు పూసపాటి అశోక్‌గజపతిరాజు సహా ఆ పార్టీనాయకులంతా విమర్శలు చేశారు. అప్పటికి టిడిపి అనుమతులు తెచ్చుకోలేదని, భూసేకరణ కూడా చేయలేదని, ఇవన్నీ అప్పట్లో జరిగి ఉంటే నిర్మాణ పనులు ఎందుకు చేపట్టలేదని జిల్లాకు చెందిన మంత్రి బొత్స సత్యనారాయణ, వైసిపి జిల్లా అధ్యక్షులు మజ్జి శ్రీనివాసరావు తిప్పికొట్టారు. చివరకు శంకుస్థాపన కార్యక్రమానికి వచ్చిన సిఎం కూడా ఇదే చెప్పారు. కానీ, ఇటువంటి రాజకీయాలు ఆయా పార్టీల మెప్పు కొరకు, ప్రజల దృష్టి మళ్లించడానికి, వాస్తవాలను కప్పిపుచ్చడానికి తప్ప ఇంకెందుకూ పనికిరావని జనం చర్చించుకుంటున్నారు. ఇందుకు కారణం లేకపోలేదు. వైసిపి నాయకులు అన్నట్టుగానే భూసేకరణ పూర్తికాకముందే అప్పటి సిఎం చంద్రబాబు ఎన్నికల్లో లబ్ధికోసం హడావుడి చేశారు. కానీ, ఇప్పుడు వైసిపి చేసిందేమిటి? నాలుగేళ్లపాటు ఎందుకు తాత్సారం చేశారు? చిత్తశుద్ధి ఉంటే ఇంత సమయం పట్టేదా? చంద్రబాబు మాదిరిగా ఎన్నికలు దగ్గరపడినంత వరకు ఎయిర్‌పోర్టు గుర్తుకు రాలేదా? అని జనం చర్చించుకుంటున్నారు. వాస్తవానికి తమకు పునరావాసం కల్పించాలంటూ నిర్వాసితులు నెత్తీనోరు కొట్టుకున్నంత వరకు ప్రభుత్వం ఆర్‌అండ్‌ఆర్ విడుదల చేయలేదు. ఈ మాటకొస్తే... ఎయిర్‌పోర్టు ప్రతిపాదన మొదలుకుని, భూసేకరణ, నష్టపరిహారం, పునరావాసం తదితర అంశాలపై ఇటు వైసిపి, అటు టిడిపి 'ఏ ఎండకు ఆ గొడుగు' అన్న చందంగానే వ్యవహరించాయి. చివరకు మెరుగైన నష్టపరిహారం, పునరావాసం కోసం ఆ సమయంలో సిపిఎం తదితర వామపక్ష పార్టీలు, రైత సంఘం ఆధ్వర్యాన చేపట్టిన పోరాటంలో నాయకులు, నిర్వాసితులపట్ల ఒకింత కర్కశంగానే వ్యవహరించాయి. పుట్టిపెరిగిన ఊళ్లు, తాతతండ్రుల నాటి భూములు త్యాగం చేసినవారికి న్యాయం చేయాలని కోరిన నాయకులపై అక్రమ కేసులు బనాయించి, నిన్నమొన్నటి వరకు కోర్టుల చుట్టూ తిప్పాయి. ఇప్పటికీ ఎమర్జన్సీ తరహా రోజులు భోగాపురం ప్రాంతవాసులు కళ్లముందు కదిలాడు తున్నాయి. ఈ రెండు పార్టీలూ నిర్వాసితులపైనా, వారికి అండగా నిలిచిన నాయకులపైనా ఒకే విధంగా వ్యవహరించాయి. ఈ విషయంలో టిడిపి, వైసిపి అన్న తేడా లేనే లేదు. మరో విషయమైమంటే నేటి వైసిపి ప్రభుత్వంగానే, నాటి టిడిపి ప్రభుత్వంగానీ ఎయిర్‌పోర్టుతో విజయనగరం జిల్లా స్థితిగతులు, రూపురేఖలు మారిపోతాయని, ఉద్యోగ, ఉపాధి అవకాశాలు ఇబ్బుడిముబ్బిడిగా వచ్చేస్తాయని నమ్మబలికాయి. కానీ, ఎలాంటి ఉద్యోగాలు వస్తాయి? అవి ఎవరిని వరిస్తాయి? అని జనం ప్రశ్నిస్తున్నారు. భోగాపురం ప్రాంతం వరకు రూపురేఖలైతే కార్పొరేట్ శక్తుల హడావుడితో మారిపోవచ్చు. కానీ, ఎయిర్‌పోర్టులో ఉద్యోగాలు ఇంజినీరింగ్ చదువులతో ముడిపడి ఉంటాయి. పోనీ ఈ ప్రాంతంలోనే అటువంటి విద్యార్హతవారు ఉన్నారనుకుంటే వారికేమైె రిజర్వుచేస్తారా? అన్న ప్రశ్నలు తలెత్తుతాయి. భోగాపురం ప్రాంతంలో కొంతమేరకు హోటళ్లు, టీ, టిఫిన్ దుకాణాలు ఏర్పాటు కావచ్చు. కానీ, ఆ దరిదాపుల్లో పేదలకు స్థలాలు లేవు. ఇప్పటికే బడాపెట్టుబడిదారులు, ధనవంతులు స్థలాలు ఇబ్బడి ముబ్బడిగా కొనుగోలు చేశారు. కాబట్టి ఇవి కూడా తిరిగి కార్పొరేట్, పెట్టుబడిదారులే ఏర్పాటు చేస్తారు. అందులో పనులు మాత్రమే దొరికే అవకాశం ఉంది. ట్రాన్స్‌పోర్టు రంగం కొంతమేర పెరిగేందుకు అవకాశం ఉన్నప్పటికీ, వాటి అందుకునే శక్తి స్థానికులకు కల్పించకుండా అందులోనూ ఎదిగే అవకాశం లేదు. కాబట్టి కళ్లముందు ఆకాశ హార్మ్యాలు కనిపించడం తప్ప కేవలం ఎయిర్‌పోర్టు వల్లే ఉద్యోగ అవకాశాలు పెరుగుతాయని ఆశించడం ఎండమావి కోసం ఎదురు చూసినట్టేనని జనం చర్చిస్తున్నారు. పర్యాటకుల రాకపోకలు, హోటళ్ల ఏర్పాటు, రవాణా రంగంలో అభివృద్ధి వల్ల పరిమితమైన అవకాశాలు మాత్రం లభ్యమయ్యే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో అధికార ప్రతిపక్షాలు జిల్లాలో 80శాతం ప్రజానీకం ఆధారపడిన వ్యవసాయ రంగంపైన, అత్యంత వెనుకబాటుగావున్న పారిశ్రామిక రంగంపైనా దృష్టిపెట్టాలని జనం కోరుతున్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కళావతి

మెరుగైన సేవలు అందించండి : ఎమ్మెల్యే

పాలకొండ: ఆస్పత్రిలో రోగులకు మెరుగైన సేవలు అందించాలని స్థానిక ఎమ్మెల్యే వి.కళావతి అన్నారు. శనివారం ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి అధ్యక్షత వహించిన ఆమె ఆస్పత్రిలో రోగులకు ఎల్లవేళలా సేవలందించాలన్నారు. రానున్న రోజుల్లో వ్యాధులు విజృంభిస్తాయని, కావున అప్రమత్తంగా ఉండాలని అన్నారు. ఆస్పత్రిలో ఎటువంటి సమస్యలున్నా తన దృష్టికి తీసుకురావాలన్నారు. సంబంధిత అధికారులతో మాట్లాడుతానన్నారు. ఆస్పత్రికి వచ్చిన కేసులు రిఫర్ చేయవద్దని కోరారు. ఎంఎల్‌సి పాలవలస విక్రాంత్ మాట్లాడుతూ ఆస్పత్రిలో అన్ని సాదుపాయాలు కల్పనకు తమవంతు చర్యలు తీసుకుంటామన్నారు. అవసరాలు గుర్తించి తమవద్దకు వస్తే నివేదిక తయారు చేసి ఎంఎల్‌ఎతో కలిపి ఆరోగ్యశాఖా మంత్రి దృష్టికి తీసుకువెళ్తానన్నారు. ఈ సమావేశంలో ఏరియా ఆస్పత్రి సూపరింటిండెంట్ నాగభూషణరావు, సభ్యులు ఉన్నారు.

నైట్ వాచ్‌మేన్ నియామకంపై విచారణ

ప్రజాశక్తి -వీరఘట్టం

మండలంలోని కంబర వలస జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల నైట్ వాచ్మెన్ పోస్టుకు సంబంధించి గ్రామంలో వివాదం చోటు చేసుకోవడంతో శనివారం సీతంపేట ఐటిడిఎ పిఒ కల్పనా కుమారి విద్యాశాఖ అధికారులు, గ్రామస్తులను సమన్వయం చేసి విచారణ చేపట్టారు. ఇరు వర్గాల నుంచి స్పష్టత లేకపోవడంతో డిప్యూటీ డిఇఒ, తహశీల్దార్, ఎంపిడిఒ, ఎంఇఒ ఈనెల 8న గ్రామానికి చేరుకొని పూర్తి వివరాలు సేకరించాలని ఆదేశించారు. తదుపరి నైట్ వాచ్మెన్ పోస్టును నియమించేందుకు చర్యలు తీసుకుంటామని పిఒ స్పష్టం చేశారు. విచారణ అనంతరం గ్రామంలో పర్యటించారు. ఈ సందర్భంగా దళిత వీధిలో తాగునీటి సమస్యతో పాటు గహ నిర్మాణ బిల్లులు, విద్యుత్ స్తంభాలు వంటి సమస్యలను పిఒ దృష్టికి తీసుకొచ్చారు. గత ఏడాది టైలరింగ్ సంబంధించి పథకం వర్తించిందని, ఈ ఏడాది ఆ పథకం రాలేదని తెలపగా, పిఒ స్పందించి తక్షణమే ఈ సమస్య పరిష్కరించాలని ఎంపిడిఒ వెంకట్రావును ఆదేశించారు. గ్రామంలో ఆరుగురు డప్పు కళాకారులకు ఐదేళ్లుగా దరఖాస్తు చేసుకున్నా కనీసం అధికారులు పట్టించుకోవటం లేదని పిఒ దృష్టికి తీసుకొచ్చారు. దళితుల నుంచి సమస్యలు విన్న పిఒ ఈనెల 8న స్వయంగా గ్రామాల్లో సమావేశం ఏర్పాటు చేసి ఏ సమస్యలున్నాయో వాటిని పరిష్కరించేందుకు అధికారులను ఆదేశించారు.

సత్తాచాటిన టెన్త్ విద్యార్థులు

ప్రతిభ కనబర్చిన గురునాథ్‌ను అభినందిస్తున్న పిఒ కల్పనకుమారి

జిల్లా వ్యాప్తంగా శనివారం విడుదలైన పదో తరతగతి పరీక్షా ఫలితాల్లో ప్రభుత్వ, ప్రయివేట్ పాఠశాలల విద్యార్థులు సత్తా చాటారు. పలు ప్రభుత్వ, ప్రైవేట్ స్కూళ్లు నూరుశాతం ఉత్తీర్ణత సాధించాయి.

బాలికలదే హవా

సీతంపేట : స్థానిక ఐటిడిఎ పరిధిలోని పాఠశాలలు పదో తరగతి ఫలితాల్లో 93శాతం ఉత్తీర్ణత సాధించాయి. ఈ ఫలితాల్లో బాలికలే పై చేయి సాధించారు. ఐటిడిఎ పరిధిలో ఈ విద్యా సంవత్సరంలో 1401 విద్యార్థులు పరీక్షలు రాయగా 1241 మంది ఉత్తీర్ణత సాధించారు. 39 పాఠశాల నుంచి పరీక్షలు రాశారు. బాలురు 603 మందికి 510 మంది ఉత్తీర్ణత సాధించగా, బాలికలు 798 మందికి 731 మంది పాసయ్యారు. వీటిలో 14 ఆశ్రమ పాఠశాలలు శత శాతం సాధించారు. ధోనుబాయి ఆశ్రమ పాఠశాలకు చెందిన పాలక గురునాథ్ 571 మార్కులు సాధించాడు. సీతంపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన బుడ్డు సిద్దు 568 మార్కులు సాధించాడు. సీతంపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాల, హడ్డుబంగి బాలికల ఆశ్రమ పాఠశాల, సామరెల్లి బాలికల ఆశ్రమ పాఠశాల సీతంపేట బాలిక, బాలుర ఆశ్రమ పాఠశాలు శతశాతం ఉత్తీర్ణత సాధించాయి. అలాగే ధోనుభాయి ఆశ్రమ ఉన్నత పాఠశాల, పెద్దపోల్ల ఆశ్రమ ఉన్నత పాఠశాలలు శతశాతం ఉత్తీర్ణత సాధించాయి. దీంతో పిఒ కల్పనకుమారి, డిడి నగేష్, ఎడ్యుకేషన్ ఒఎస్‌డి ఎం.యుగంధర్, ఎటిడబ్ల్యుఒ మంగవేణి విద్యార్థులను అభినందించారు.

సత్తా చాటిన విద్యార్థులు

కొమరాడ : మండలంలోని ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న పదో తరగతి విద్యార్థులు పరీక్షల్లో సత్తా చాటారు. మండలంలో కోటిపాము జిల్లా పరిషత్ హైస్కూల్లో అర్తాంకు చెందిన కలిశెట్టి భార్గవి 562 మార్కులు సాధించి మండలంలోని ప్రథమ స్థానంలో నిలిచింది. మండల కేంద్రం లోని డాక్టర్ బి. ఆర్ అంబేద్కర్ బాలికల గురుకులంలో 80 మంది విద్యార్థునులు పదవ తరగతి పరీక్షలకు హాజరు కాగా వారిలో 79 మంది ఉత్తీర్ణులు (98.75%) అయ్యారు . అంబేద్కర్ గురుకుల పాఠశాలలో చదువుతున్న బోటు. శిరీష 554 మార్కులు సాధించి పాఠశాల ప్రథమ స్థానంలో నిలిచింది. 17మంది 500 మార్కులకు పైబడి ఉత్తీర్ణత సాధించారని ప్రిన్సిపల్ ఎ.రజనీకుమారి తెలిపారు.

ప్రతిభ చాటిన ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు

పార్వతీపురంరూరల్ : మండలంలో ప్రభుత్వ ఉన్నత పాఠశాలల విద్యార్థులు పదో తరగతి పరీక్షల్లో సత్తా చాటారు. బందలుప్పి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన రెడ్డి శరత్‌కుమార్ 575 మార్కులు సాధించి మండలంలో టాప్‌గా నిలిచాడు. ఇదే పాఠశాలలో 92 మంది విద్యార్థులు పరీక్షకు హాజరుకాగా, 86 మంది ఉత్తీర్ణులైనట్లు ప్రధానోపాధ్యాయులు శ్యామ్ తెలిపారు. అలాగే కవిటిభద్ర పాఠశాల విద్యార్థులు శతశాతం ఉత్తీర్ణత సాధించారు. ఈపాఠశాలకు చెందిన జన్ని గౌతమి 563మార్కులు సాధించింది. డోకిశిల గిరిజన సంక్షేమ పాఠశాల శతశాతం ఉత్తీర్ణత సాధించగా, అందరూ ప్రథమస్థానం సాధించడం విశేషం. ఈ పాఠశాలకు చెందిన దేవరాపల్లి భవాని 528 మార్కులు సాధించి స్కూల్‌లో ఫస్టు సాధించింది. అలాగే రావికోన గిరిజన సంక్షేమ పాఠశాల, ఎన్.ములగ, తాళ్లబురిడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు శతశాతం ఉత్తీర్ణత సాధించాయి. ఉత్తీర్ణులై విద్యార్థులను ఆయా పాఠశాలల ఉపాధ్యాయ బృందం, ప్రధానోపాధ్యాయులు, విద్యార్థులు తలిదండ్రులు, గ్రామస్థులు అభినందించారు.

గుమ్మలక్ష్మీపురం: మండలంలో టెన్త్ ఫలితాల్లో బాలికలే పై చేయి సాధించారు. మండలంలోని 13 పాఠశాలల నుంచి 723 మంది విద్యార్థులు పరీక్ష రాయగా 713 మంది ఉత్తీర్ణులయ్యారు. బాలికలు 99.28 శాతం ఉత్తీర్ణ సాధించగా బాలురు 97.70శాతం ఉత్తీర్ణత సాధించారు. భద్రగిరి గిరిజన గురుకుల బాలికల పాఠశాల విద్యార్థిని బిడ్డిక అలేఖ్య 559 మార్కులతో ప్రథమ స్థానంలో నిలవగా, గుమ్మలక్ష్మీపురం జెడ్పిహెచ్ పాఠశాల విద్యార్థిని తెర్లాపు దివ్య 558 మార్కులతో ద్వితీయ స్థానం, ఎన్ నందిని 552 మార్కులతో మండలంలో మూడవ స్థానం, భద్రగిరి బాలుర పాఠశాల విద్యార్థి గుడ్ల చానిక్ 551 మార్కులతో నాలుగవ స్థానంలో నిలిచాడు.ఎం త్రిలోక బాబు 549 మార్కులతో ఐదవ స్థానంలో నిలిచాడు.

సాలూరు రూరల్: ఆశ్రమ పాఠశాలలో మంచి ఫలితాలు. కొత్తవలస, మావుడి, కురుకుట్టి, తోణాం గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలో 178 మంది విద్యార్థుల పరీక్షలు రాయగా, అందులో 157మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. గిరిజన సంక్షేమ ఆశ్రమ మహిళా పాఠశాల కొత్తవలసలో 115 మందికి 107మంది ఉత్తీర్ణత సాధించారు. ప్రభుత్వ మోడల్ స్కూల్‌లో 89 విద్యార్థులకు 85మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. మండలంలోని 4 జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో 156 మందికి 87మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. ప్రభుత్వ మోడల్ స్కూల్ విద్యార్థిని ఎ.శైలజ 574, నిఖిత 572, జి.ప్రశాంత్ 551మార్కులు సాధించారు.

ఆశ్రమ పాఠశాలల్లో పెరిగిన ఉత్తీర్ణత

గుమ్మలక్ష్మీపురం: గతంతో పోల్చుకుంటే ఈసారి పదవ తరగతి పరీక్షల్లో ఆశ్రమ పాఠశాలల్లో ఉత్తీర్ణత శాతం పెరిగింది. కేదారిపురం బాలికల ఆశ్రమ పాఠశాలలో 44 మంది, భద్రగిరి పిటిజి పాఠశాలలో 79 మంది, కస్తూరిబా పాఠశాలలో 34మంది, గుమ్మలక్ష్మీపురం ఆశ్రమ పాఠశాలలో 59మంది, పి ఆమిటి ఆశ్రమ పాఠశాలలో 78 మంది విద్యార్థినులు పరీక్షలు రాయగా అందరూ ఉత్తీర్ణత సాధించారు. భద్రగిరి గురుకుల బాలురు పాఠశాలలో 80 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా నూటికి నూరు శాతం ఉత్తీర్ణత సాధించారు. కొత్త గూడ ఆశ్రమ పాఠశాలలో 27 మంది, రేగిడి ఆశ్రమ పాఠశాలలో 87 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. కేదారిపురం ఆశ్రమ పాఠశాలలో 531, కొత్తగూడ 543, భద్రగిరి బాలుర పాఠశాలలో 551, పి టిజి 559, కస్తూరిబా పాఠశాల 541, గుమ్మలక్ష్మీపురం ఆశ్రమ పాఠశాల 530, పి ఆమిటి 540, రేగిడి ఆశ్రమ పాఠశాల 535, దొరజమ్ము 519, టిక్కబాయి ఆశ్రమ పాఠశాల విద్యార్థులు 524 మార్కులతో ప్రతిభ కనబరిచారు.

జియ్యమ్మవలస : మండలంలోని 459 మంది విద్యార్థులకు గాను 435 విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. మండలంలోని బిజె పురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుతున్న బడే కేశవ నాయుడు 581, చిన్నదం జడ్పీహెచ్ఎస్ పాఠశాల విద్యార్థి నల్ల పూజిత 577, చిన మేరంగి జడ్పీహెచ్ఎస్ఎ విద్యార్థిని జోష్ణ ప్రియదర్శిని 571 మార్కులతో మండల స్థాయిలో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించాయి. అలాగే జియమ్మ వలస జెడ్ పి హెచ్ ఎస్, ట్రైబల్ వెల్ఫేర్, వనజ ట్రైబల్ వెల్ఫేర్, టికె జమ్ము ట్రైబల్ వెల్ఫేర్, రావాడ రామభద్రపురం ట్రైబల్ వెల్ఫేర్, చినకుదమ జెడ్పిహెచ్ఎస్, పెద బుడ్డిడి జడ్పీహెచ్ఎస్, పిప్పల భద్ర జడ్పీహెచ్ఎస్ పాఠశాలల్లో శత శాంతం సాధించారు. పెదమెరంగి జంక్షన్‌లో గల తిరుమల సాయి విద్యానికేతన్, సత్య కైలాస్ పాఠశాల విద్యార్థులు నూరుశాతం ఉత్తీర్ణత సాధించారు.

ప్రభుత్వ పాఠశాలలో మెరుగైన ఫలితాలు

పాలకొండ రూరల్ : మండలంలోని ప్రభుత్వ పాఠశాలలో మెరుగైన ఫలితాలు వచ్చాయి. బడ్డుమాసింగి ఆశ్రమ పాఠశాలలో 19 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకాగా 19 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. ఎం. సింగుపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 59 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకాగా 56 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు.

విద్యార్థికి పిఒ అభినందనలు

సీతంపేట : ఐటిడిఎ పరిధిలో గల ధోనుబాయి బాలుర ఆశ్రమ ఉన్నత పాఠశాల విద్యార్థి పాలక గురునాథ్ 571 మార్కులు సాధించినందుకు పిఒ కల్పన కుమారి అభినందించారు. అలాగే పులుపుట్టి సమీపంలో ఉన్న భారతి ఇంటర్నేషనల్ స్కూల్ నూరుశాతం ఫలితాలు సాధించింది. ఈ పాఠవాల విద్యార్థిని కె.భాషిత 579 మార్కులతో టాపర్‌గా నిలిచారు. విజేతలను ప్రిన్సిపల్ నవీన్, కరస్పాండెంట్ పెంటయ్య, ఉపాధ్యాయులు అభినందించారు.

భామిని : మండలంలోని పెద్దిదిమిలి, బాలేరు, భామిని, బత్తిలి జెడ్ పి హెచ్ స్కూల్లు విద్యార్థులు, ఆదర్శ పాఠశాల విద్యార్థులు పదోతరగతి లో మెరుగైన ఫలితాలు సాధించారు. బాలేరు హై స్కూల్ విద్యార్థిని కేవటి రేవతి 568 మార్కులు సాధించి మండల టాపర్‌గా నిలిచింది. పాస్ అయిన విద్యార్థులుకు పాఠశాల యాజమాన్యం అభినందనలు తెలిపారు.

94.15శాతం ఉత్తీర్ణత సాధించిన ఐటిడిఎ పాఠశాలలు

కలెక్టరేట్ : పార్వతీపురం ఐటిడిఎ పరిధిలో గల 39 పాఠశాల నుంచి 1606 మంది విద్యార్థులు హాజరు కాగా వీరిలో 1512 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. వీరిలో 1271 మంది విద్యార్థులు ప్రథమ శ్రేణిలో, 201 మంది విద్యార్థులు ద్వితీయ, 40 విద్యార్థులు తతీయ శ్రేణిలో ఉత్తీర్ణులైనారు. 16పాఠశాలలు శతశాతం ఉత్తీర్ణత సాధించాయి.

సీతానగరం : మండలంలో 10వ తరగతి పరీక్షల్లో 74.5శాతం విద్యార్థులు ఉత్తీర్ణత శాతం సాధించినట్టు ఎంఇఒ జి.సూర్యదేముడు తెలిపారు. మండలంలోని 9 హైస్కూళ్ల నుంచి 531 మంది పదో తరగతి పరీక్షలు రాయగా, వీరిలో 380 ఉత్తీర్ణులయ్యారు. జోగంపేట పాఠశాల విద్యార్థి బి.యోగేశ్వర్ 572 మార్కులు సాధించి మండల టాపర్‌గా నిలిచాడు.

పది పరీక్షల్లో ప్రభుత్వ పాఠశాలల హవా

సాలూరు: పట్టణంలోని జ్యోతిరావు పూలే బిసి బాలికల గురుకుల పాఠశాల విద్యార్థులు 76మంది పరీక్షలకు హాజరవగా 74మంది ఉత్తీర్ణత సాధించారు. ఈ పాఠశాలకు చెందిన కర్రి షర్మిల 585 మార్కులు, తెంటు యామిని 581, డమరుసింగు లత 574మార్కులతో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచారు. ప్రథమ శ్రేణిలో 72మంది, ద్వితీయ శ్రేణి లో ఇద్దరు ఉత్తీర్ణత సాధించారని ప్రిన్సిపాల్ ఎం.పెంటయ్య చెప్పారు.37మంది విద్యార్థినులు 500మందికి పైగా మార్కులు సాధించినట్లు తెలిపారు. ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థినులను ఆయన అభినందించారు.

గిరిజన సంక్షేమ పాఠశాలల్లో 89శాతం ఉత్తీర్ణత

సాలూరు గిరిజన సహాయ గిరిజన సంక్షేమ అధికారి పరిధిలోని ఆశ్రమ పాఠశాలల్లో 89.62శాతం విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారని ఎటిడబ్ల్యుఓ శ్రీనివాసరావు చెప్పారు. సాలూరు, పాచిపెంట, మక్కువ మండలాలకు చెందిన 607మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 544మంది ఉత్తీర్ణత సాధించారని తెలిపారు.వీరిలో 446మంది ప్రథమ శ్రేణి లో,78మంది ద్వితీయ శ్రేణి లో ఉత్తీర్ణత సాధించారని చెప్పారు.

శ్రీకృష్ణలో 94శాతం ఉత్తీర్ణత

కలెక్టరేట్ : టెన్త్ ఫలితాల్లో పట్టణంలోని శ్రీకృష్ణ స్కూలు 94శాతం ఉత్తీర్ణత సాధించింది. పాఠశాలకు చెందిన బెవర లికిత, వంజరాపు భాగ్యశ్రీ 587 మార్కులు సాధించి స్కూల్ ఫస్ట్‌గా నిలిచారు. 74 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కాగా, 69 మంది ఉత్తీర్ణత సాధించారు. ఈ ఏడాది టెన్త్ పరీక్షలకు హాజరైన విద్యార్థుల్లో 550 మార్కులకు పైబడి 17 మంది విద్యార్థులు, 500 మార్కులు పైగా 30 మంది సాధించారు.

శత శాతం ఉత్తీర్ణత సాధించిన శ్రీజన్

పట్టణంలోని శ్రీజన్ గ్లోబల్ స్కూల్లో 21 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కాగా 21 మంది ఉత్తీర్ణులై శతశాతం ఉత్తీర్ణత సాధించారు. వీరిలో అంబటి షణ్ముఖ 563 మార్కులు, పలనీస్ 559 మార్కులు, సాయి సంపత్ 558 మార్కులు సాధించి మొదటి మూడు స్థానాల్లో నిలిచారు. 500 మార్కులు పైబడి 12మంది విద్యార్థులు సాధించారు. పరీక్షల్లో ఉత్తీర్ణులైన విద్యార్థులకు, యొక్క తల్లిదండ్రులకు శ్రీజన్ గ్లోబల్ స్కూల్ కరస్పాండెంట్ యు. శ్రీను, ప్రిన్సిపల్ డి .నాగేశ్వరరావు అభినందనలు తెలిపారు.

నారాయణ స్కూల్ టాప్

పార్వతీపురం రూరల్ : స్థానిక నారాయణ పాఠశాలకు చెందిన వై. హేనుజ, పి.ప్రణీతులు 591 మార్కులు సాధించి పార్వతీపురానికి టాపర్‌గా నిలిచారు. పాఠశాల నుండి 87మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కాగా 87 మంది ఉత్తీర్ణులై శతశాతం విజయం సాధించినట్లు స్కూల్ మేనేజ్మెంట్ తెలిపింది. టాపర్లుగా నిలిచిన విద్యార్థులకు పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయ బృందం, తల్లిదండ్రులు అభినందనలు తెలిపారు.

పాలకొండ : విద్యార్థులకు స్వీట్లు తినిపిస్తున్న తమ్మినాయుడు పాఠశాల యాజమాన్యం, తల్లిదండ్రులు

కెపిఎం హై స్కూల్ లో 79 శాతం ఉత్తీర్ణత

కలెక్టరేట్ : పట్టణంలోనిక కెపిఎం హైస్కూల్ విద్యార్థులు 79 శాతం ఉత్తీర్ణత సాధించారు. గాయత్రి, జ్యోత్స్న 582 మార్కులు సాధించి పాఠశాల విద్యార్థుల ఉత్తీర్ణతలో ప్రథమ స్థానంలో నిలిచారు. ఈ పాఠశాల నుండి 149 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కాగా 117 మంది ఉత్తీర్ణులయ్యారు. వీరిలో 15 మంది విద్యార్థులకు 550 మార్కులు పైబడి, 30 మంది విద్యార్థులు 500 మార్కులు పైబడి సాధించారనీ కెపిఎం హై స్కూల్ ప్రధానోపాధ్యాయులు వై .అప్పలనాయుడు తెలిపారు.

సురేష్ స్కూల్ విద్యార్థుల ప్రతిభ

పార్వతీపురం రూరల్ : మండలంలోని సురేష్ స్కూల్ విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. పాఠశాలకు చెందిన విద్యార్థి కె.జాగతి 586 మార్కులు సాధించి పాఠశాలలో టాపర్‌గా నిలిచారు. పాఠశాల నుండి 183 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కాగా 174 మంది ఉత్తీర్ణులై 95.08 ఉత్తీర్ణత శాతం నమోదు చేసినట్లుగా ప్రిన్సిపల్ గుడ్ల ప్రసాదరావు తెలిపారు.

విద్యార్థులను అభినందిస్తున్న పాఠశాల యాజమాన్యం

టౌన్ ఫస్ట్ సాధించిన దీప్తి హైస్కూల్

సాలూరు: పదోతరగతి పరీక్షల్లో పట్టణం లోని దీప్తి హైస్కూల్ విద్యార్థినులు టౌన్ ఫస్ట్, సెకెండ్ సాధించారు. సిహెచ్.అమతవర్షిణి 589మార్కులతో టౌన్ ఫస్ట్ సాధించగా, కె.జ్యోత్స్న 588మార్కులతో టౌన్ సెకెండ్ సాధించారు. వీరిని పాఠశాల హెచ్ ఎం కాశినాయుడు,ఇతర ఉపాధ్యాయులు అభినందించారు.

వీరఘట్టం : మండలంలోని నీలానగరం, బిటివాడచ కత్తల కవిటి, గంగంపేట గిరిజన ఆశ్రమ, కేజీబీవీ పాఠశాలలు శాతశాతం ఉత్తీర్ణత సాధించాయి. అలాగే మౌంట్ పోర్టు, సెయింట్ జేవియర్ , మహర్షి పాఠశాలను కూడా శత శాతం ఉత్తీర్ణత సాధించాయి. ఇదిలా ఉండగా మండలంలోని బిటివాడ జిల్లా ఉన్నత పాఠశాల విద్యార్థి వంజరాపు కార్తీక్ 578 మార్కులతో మండల టాపర్‌గా నిలిచాడు.

టిఆర్ఎంఎం గర్ల్స్ హైస్కూల్లో 61 మంది ఉత్తీర్ణత

కలెక్టరేట్ : పట్టణంలోని టిఆర్ఎస్ స్కూల్ నుండి 93 మంది విద్యార్థులు పరీక్షలుకు హాజరు కాగా 61 మంది విద్యార్థులు (66శాతం) ఉత్తీర్ణులయ్యారు. ఆర్ .అనుష్క 574 మార్కులు సాధించి పాఠశాల ప్రథమ స్థానం కైవసం చేసుకున్నట్లుగా హెచ్ఎం డి.శోభారాణి తెలిపారు.

ఫ్యామిలీ ఫిజీషియన్‌తో ప్రజల చెంతకు వైద్యం

కొమరాడ : రాష్ట్ర ప్రభుత్వం పేదలకు సరైన వైద్యం అందేందుకు ప్రవేశపెట్టిన కుటుంబ వైద్యుడు విధానంతో ప్రజల చెంతకు వైద్యం చేరుతుందని డిప్యూటీ డిఎంహెచ్ఒ డాక్టర్ వెంకటరమణ అన్నారు. శనివారం మండలంలోని చిన ఖర్జేలో కుటుంబ వైద్యుడి విధానంలో భాగంగా ఇంటింటికి వెళ్లి ఆరోగ్య పరీక్షలు చేశారు. అనంతరం అంగన్వాడీ కేంద్రాల్లో పిల్లలకు వైద్య తనిఖీలు చేశారు. ఇంటింటికి వెళ్లి ప్రజల ఆరోగ్య వివరాలు అడిగి తెలుసుకున్నారు. అవసరమైన వారికి ఇసిజి తదితర రక్త పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ప్రజలు వ్యాధుల పట్ల జాగ్రత్తగా ఉండేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ప్రజలు గ్రామ సమీపంలో పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుంటే వ్యాధులను దూరం పెట్టవచ్చని తెలిపారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన కుటుంబ వైద్యుల విధానంతో ప్రజలంతా వైద్య సేవలు అందించడమే ముఖ్యోద్దేశమని అన్నారు. ఏ చిన్న అనారోగ్యం వచ్చినా తక్షణమే ఆసుపత్రికి వచ్చి ప్రజలు వైద్య తనిఖీలు చేసుకోవాలని సూచించారు. గ్రామంలో వైద్య సిబ్బంది అందిస్తున్న వైద్య సేవలపై గ్రామస్తులు వైద్యాధికారులకు, ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో కొమరాడ వైద్యాధికారి అరుణ్ కుమార్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

మున్సిపల్ ఇంజనీరింగ్ అసిస్టెంట్లతో మాట్లాడుతున్న పబ్లిక్ హెల్త్ ఎస్ఇ

స్మార్ట్ టౌన్ షిప్ పరిశీలన

సాలూరు : పట్టణానికి చెందిన జగనన్న స్మార్ట్ టౌన్ షిప్ లేఅవుట్‌ను శనివారం పబ్లిక్ హెల్త్ ఎస్ఇ పి.రాజారావు పరిశీలించారు. లేఅవుట్‌లో కల్పించాల్సిన మౌలిక సదుపాయాల గురించి అడిగి తెలుసుకున్నారు. లే అవుట్‌లో ఇంటర్నల్ రోడ్లు, డ్రెయినేజీ వ్యవస్థ, తాగునీరు, విద్యుత్ సరఫరా వంటి సౌకర్యాల కల్పనకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని కోరారు. ఆయన వెంట స్థానిక మున్సిపల్ ఇంజనీరింగ్ అసిస్టెంట్లు ఉన్నారు.

కొడిశలో గడపగడపకు

సీతంపేట : మండలంలోని కొడిశ సచివాలయం పరిధిలో శనివారం గడపగడపకు మన ప్రభుత్వ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే వి.కళావతి పాల్గొని ప్రభుత్వ పథకాలు ప్రజలకు అందుతున్న తీరును పరిశీలించారు. ఏవైనా లోటుపాట్లు ఉన్నట్లయితే వాటి గురించి తమకు తెలపమని ఆ సమస్యలను పరిష్కారానికి సచివాలయ సిబ్బందికి తగు సూచనలు చేసి ప్రభుత్వ పథకాలను వివరిస్తూ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపిడిఒ కొండపల్లి సత్యం, ఎంపీపీ ఆదినారాయణ, కార్యకర్తలు, అభిమానులు, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు, మండల అధికారులు పాల్గొన్నారు.

టిడిపి పాలనలోనే గిరిజన సంక్షేమం

పార్వతీపురం రూరల్ : ఎన్నికల ముందు మాయ మాటలు చెప్పిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్, అధికారంలోకి రాగానే గిరిజనులకు చెందిన సంక్షేమ పథకాలన్నీ నిలిపివేశారని మాజీ ఎమ్మెల్యే బొబ్బిలి చిరంజీవులు అన్నారు. శనివారం డీకే పట్నం పంచాయతీ టొంకి, బొడ్డవలస గిరిజన గ్రామాల్లో ఇదేమి ఖర్మ మన రాష్ట్రానికి కార్యక్రమం నిర్వహించారు. కార్యకర్తలతో కలిసి గ్రామంలో నిరసన ర్యాలీ నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను వివరించారు. కార్యక్రమంలో నాయకులు, గొట్టాపు వెంకట నాయుడు బోను చంద్రమౌళి, రెడ్డి చిన్నమనాయుడు, బేత లక్ష్మణరావు, కెంగువ ప్రదీప్, భుడితి శ్రీరాములు, బంకపల్లి అశోక్, మాజీ సర్పంచులు లక్ష్మణరావు సాయిరామ కష్ణ పాల్గొన్నారు.

చలివేంద్రిలో ఫ్యామిలీ డాక్టర్

వీరఘట్టం : మండలంలోని చలివేంద్రిలో శనివారం 104 ఆధ్వర్యంలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక వైద్యాధికారి జి.ప్రదీప్ కుమార్ వివిధ రకాలైన వ్యాధిగ్రస్తులకు తనిఖీలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సూపర్వైజర్ ఒ.శాంతకుమారి, ఎంఎల్ హెచ్ పి ఆర్.లలిత, ఎఎన్ఎం జి.పైడితల్లి, టెక్నీషియన్ దినేష్, ఆశా కార్యకర్తలు, 104 సిబ్బంది పాల్గొన్నారు.

వ్యవసాయం మరింత సులభతరం కావాలి

ప్రజాశక్తి - పాలకొండరూరల్

ప్రభుత్వం క్లస్టర్ పరిధిలో ఏర్పాటు చేసిన కస్టమ్ హైరింగ్ సెంటర్ ద్వారా ఆధునిక వ్యవసాయ పనిముట్లు వినియోగించుకొని వ్యవసాయాన్ని మరింత సులభతరం చేసుకోవాలని జిల్లా ప్రత్యేక అధికారి, మహిళా, శిశు సంక్షేమ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ముద్దాడ రవిచంద్ర రైతులను కోరారు. జిల్లా పర్యటనలో భాగంగా మండలంలోని లుంబూరులోని రైతు భరోసా కేంద్రాన్ని, కస్టమ్ హైరింగ్ సెంటర్‌ను కలెక్టర్ నిశాంత్‌కుమార్‌తో కలసి శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా కస్టమ్ హైరింగ్ సెంటర్ వద్ద ఆధునిక వ్యవసాయ పనిముట్లను పరిశీలించారు. రైతులకు యాంత్రీకరణ పనిముట్లు ఏ ధరలకు అద్దెకు ఇస్తున్నది ఆరా తీశారు. జిల్లా వ్యవసాయ సలహా మండలి నిర్దేశించిన విధంగా రైతులకు అందజేస్తున్నట్లు వ్యవసాయ అధికారి రాబర్ట్ పాల్ తెలిపారు. ప్రభుత్వం అందజేస్తున్న రాయితీలను రైతులు వినియోగించుకొని ఆధునిక వ్యవసాయ పద్ధతులు అవలంబించాలని సూచించారు. తద్వారా తక్కువ పెట్టుబడితో అధిక లాభాలు సాధించవచ్చని అన్నారు. రైతు భరోసా కేంద్రంలోని కియోస్కో సేవలు ఎంతమేరకు అందుతున్నవి మండల వ్యవసాయ అధికారిని అడిగి తెలుసుకున్నారు. రైతు భరోసా కేంద్రం పరిధిలో సాగు విస్తీర్ణం, ఎంతమంది రైతులు సొంతంగా వ్యవసాయ భూమి సాగుచేస్తున్నారు, కౌలు రైతులు ఎందరు ఉన్నది, ఇ- క్రాప్ నమోదు తదితర అంశాల వివరాల రికార్డుల నిర్వహణను తనిఖీ చేశారు. క్షేత్ర స్థాయిలో పరిశీలన ద్వారా రైతులకు మరింత మేలుచేసే పథకాల రూపకల్పనకు అవకాశం ఉంటుందన్నారు. ప్రభుత్వం రైతులకు అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకొని ఆర్థిక స్థితిగతులను మెరుగుపరుచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సబ్ కలెక్టర్ నూరుల్ కమర్, ఇంచార్జి తహశీల్దార్ బుచ్చయ్య, గ్రామ వ్యవసాయ సహాయకులు, తదితరులు పాల్గొన్నారు.

గ్రామస్తులతో మాట్లాడుతున్న జిల్లాప్రత్యేక అధికారి రవిచంద్ర

ఉచిత సిమ్‌ల చాటున అక్రమ వసూళ్లు

ప్రజాశక్తి -పార్వతీపురం టౌన్

ఉచిత సిమ్‌ల చాటున అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నారని కన్స్యూమర్ రైట్స్ ప్రొటెక్షన్ ఫోరం జిల్లా అధ్యక్షులు చెందక అనిల్‌కుమార్ అన్నారు. శనివారం ఆ సంస్థ కార్యాలయంలో ఆ సంస్థ ప్రతినిధులు వి.దాలినాయుడు, జామి శ్రీనివాసరావు, బంకురు ప్రకాశరావు, మరడాన తవిటినాయుడు, కోనేటి రాము తదితరులు విలేకరులతో మాట్లాడుతూ పార్వతీపురం పట్టణంలో పలు నెట్ వర్క్ సంస్థలకు చెందిన ప్రతినిధులు సిమ్ కార్డులు ఉచితమంటూ ప్రకటనలు గుప్పించి వినియోగదారుల నుంచి రూ.150 నుంచి రూ.350 వరకు అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నట్టు తమకు కస్టమర్లు ఫిర్యాదు చేశారన్నారు. వసూళ్లకు సంబంధించి రసీదులు అడిగితే ఇవ్వడం లేదన్నారు. ఈ మేరకు తమ సంస్థకు పలువురు నుండి ఫిర్యాదులు అందాయన్నారు. అలాగే సిమ్ కార్డు బ్లాక్ అయ్యేటప్పుడు, కొత్త సిమ్ కోసం వెళితే దాదాపు రూ.200 నుంచి వసూలు చేస్తున్నారన్నారు. తక్షణమే ఆయా సంస్థల ప్రతినిధులు అక్రమ వసూలు మానుకోవాలని, లేని పక్షంలో తీసుకున్న మొత్తానికి రసీదులు ఇవ్వాలన్నారు. ఆ పరిస్థితి లేని పక్షంలో మోసపోయిన వినియోగదారుల తరపున తమ సంస్థ తీవ్రమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు.

ఉత్సవ కమిటీ సభ్యులతో మాట్లాడుతున్న సిఐ కృష్ణారావు

పండగ నిర్వహణపై సమగ్ర సమాచారం ఇవ్వండి

ప్రజాశక్తి - పార్వతీపురంటౌన్

ఇప్పల పొలమ్మ, జగన్నాధపురం ఎర్ర కంచమ్మ గ్రామ దేవతల పండగ నిర్వహణపై సమగ్ర సమాచారం ఇవ్వాలని సిఐ కృష్ణారావు నిర్వహణ సభ్యులకు సూచించారు. పట్టణంలోని ఈనెల 30న అమ్మవారి పండగల అనుపోత్సవం జరుగుతున్న దృష్ట్యా శనివారం పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఇరువర్గాల పెద్దలు, సభ్యులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సంధ్బంగా సిఐ మాట్లాడుతూ ఎలాంటి కొట్లాటలకు, వాగ్వివాదాలకు తావు లేకుండా పండగను సక్రమంగా నిర్వహించాలని, ఏ సమయానికి రెండు అమ్మవార్ల సిరిమానోత్సవాలు ప్రారంభమవుతాయని, ప్రధాన రహదారితో పాటు, ఏఏ వీధుల గుండా అమ్మవారి ఘటాలు, ఉత్సవానికి సంబంధించిన వేషధారణలు, మేళతాళాలు, సాంస్కృతిక కార్యక్రమాలు తిరుగుతాయో తెలపాలన్నారు. వీటికి సంబంధించిన రూట్ మ్యాప్ తెలపాలన్నారు. ముందుగా ఇరువర్గాలు సమావేశమై కార్యాచరణ రూపొందించుకొని తమకు తెలియజేస్తే ఏ ఎస్పి దృష్టికి తీసుకెళ్లి పండగ బందోబస్తుకు చర్యలు చేపడతామని అన్నారు. ఇరు వర్గాల పెద్దలు, సభ్యులు స్పందిస్తూ సమావేశం ఏర్పాటు చేసుకొని సోమవారానికి నివేదిక అందజేస్తామని సిఐ కు తెలియజేశారు.

వెంకటరమణ కుటుంబానికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి - కురుపాం

గత కొన్ని రోజుల క్రితం అనారోగ్యంతో బాధపడి కటిక బీదరికం అనుభవిస్తూ మండల కేంద్రంలో గల శివన్నపేటకు చెందిన పెదపెంకి వెంకటరమణ మృతి చెందిన సంఘటన తెలుసుకొని ఆయన వద్ద ప్రైవేట్ చదువుకున్న విద్యార్థులు రూ.43వేలు పోగుచేసుకొని శనివారం తహశీల్దార్ ఆర్.రమేష్‌కుమార్ చేతుల మీదుగా ఆయన భార్యకు 11వ రోజు దిన కార్యం నిమిత్తం అందజేశారు. ఈ సందర్భంగా తహశీల్దార్ మాట్లాడుతూ ప్రభుత్వ పరంగా వచ్చినటువంటి అన్ని పథకాలను అందజేసేలా చర్యలు తీసుకుంటానని అన్నారు. కార్యక్రమంలో ఆర్ఐపిఎల్‌వి ప్రసాద్, ఆయన వద్ద విద్యాభ్యాసం పొందిన విద్యార్థులు వంజరాపు సింహాచలం, దన్నాన గణేష్ తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరి

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

ప్రతి వాహనదారుడు ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరిగా పాటించి వాహనాలు నడపాలని ఎల్విన్ పేట ఎస్ఐ షణ్ముఖరావు సూచించారు. మండల కేంద్రంలో శనివారం వాహనదారులకు అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ప్రతి వాహనదారుడు లైసెన్స్ కలిగి ఉండాలని, హెల్మెట్ ధరించి వాహనాలు నడపాలని, అతివేగంతో వాహనాలు నడిపి ప్రమాదాలకు గురికా వద్దని హెచ్చరించారు. త్రిబుల్ డ్రైవింగ్ వాహనాలు కనిపిస్తే కఠిన చర్యలు తప్పవని, మద్యం సేవించి వాహనాలు నడిపితే కేసు నమోదు చేసి జైలు శిక్ష తప్పదని హెచ్చరించారు. సురక్షిత ప్రయాణం చేసి విలువైన ప్రాణాలు కాపాడుకోవాలని కోరారు.

విద్యాశాఖ కమిషనర్‌ను కలిసిన సామల

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

విద్యాశాఖ కమిషనర్ ఎస్.సురేష్ కుమార్‌ను విజయవాడ సమగ్ర శిక్ష కార్యాలయంలో జరిగిన ఉపాధ్యాయ సంఘాల సమావేశం అనంతరం కలిసినట్లు ఎపి ఎస్సీ ఎస్టీ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర అధ్యక్షులు సామల సింహాచలం శనివారం తెలిపారు.ఈ సందర్భంగా డ్రాయింగ్ మీరు చక్కగా వేస్తున్నారని తనను ప్రత్యేకంగా కమిషనర్ అభినందించడం ఎంతో ఆనందంగా ఉందని సామల తెలిపారు. ఇదే సందర్భంలో రాష్ట్ర సంఘం రూపొందించిన డైరీని కమిషనర్‌కు అందజేశామన్నారు. విద్యాశాఖ అమలు చేస్తున్న విద్యా కార్యక్రమాలను పాఠశాల స్థాయిలో చక్కగా అమలు చేయాలని, విద్యార్థుల సర్వతో ముఖాభివృద్ధికి ఉపాధ్యాయులు కృషి చేసేలా సంఘం తరుపున కార్యక్రమాలు చేపట్టాలని విద్యాశాఖ కమిషనర్ సూచించినట్టు తెలిపారు.

ఏగోటివలసలో ఉపాధి పనులు పరిశీలన

సీతానగరం : మండలంలోని ఏగోటివలసలో జరుగుతున్న ఉపాధి హామీ పనులను ఎంపిడిఒ ఎంఎస్ఎల్ఎన్ ప్రసాద్ శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధి కూలీలు సమయానికి వచ్చి కొలతలు ప్రకారం పని చేయాలన్నారు. పని ప్రదేశాల్లో మంచినీటి సౌకర్యం ఏర్పాటు చేసుకోవాలన్నారు. ప్రతి ఒక్కరూ టెక్నికల్ అసిస్టెంట్లు ఇచ్చిన కొలతల మేరకు పనులు చేస్తే కూలి గిట్టుబాటు అవుతుందన్నారు. కార్యక్రమంలో ఫీల్డ్ అసిస్టెంట్లు ఉపాధి కూలీలు పాల్గొన్నారు.

రిలేనిరాహార దీక్షలకు విఆర్‌ఎలు తరలిరావాలి

ప్రజాశక్తి - కురుపాం

సమస్య పరిష్కారం కోసం ఈనెల 11న విజయవాడలో జరుగు రిలే నిరాహార దీక్షలకు విఆర్‌ఎలంతా తరలిరావాలని ఆ సంఘ జిల్లా అధ్యక్షులు గరుగుబిల్లి ఈశ్వరరావు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా స్థానిక విలేకరులతో మాట్లాడుతూ విఆర్ఎల కనీస వేతనం రూ.26000 ఇవ్వాలని, నామినీలుగా పనిచేస్తున్న విఆర్ఎలను విఆర్ఒలుగా గుర్తించాలని, అర్హత గల విఆర్ఎలకు అటెండర్, వాచ్మెన్, డ్రైవర్ పోస్టులు ఇవ్వాలని, డిఎ రికవరికి మినహాయించి, డిఎతో కూడిన వేతనాలు ఇవ్వాలని కోరుతూ రిలే నిరాహార దీక్ష చేపడుతున్నామని తెలిపారు. ఈ దీక్షల్లో విఆర్ఎలంతా పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

వాహనాల తనిఖీ

ప్రజాశక్తి - సీతంపేట

మండలంలో పార్కు వద్ద సీతంపేట ఎఎస్ఐ శ్రీనివాసరావు వాహనాలు తనిఖీ చేపట్టారు. త్రిబుల్ రైడింగ్ చేసిన వారికి కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. వాహనాలకు సంబంధించిన ధ్రువపత్రాలు లేని వారికి అపరాధ రుసుం విధించారు. హెల్మెట్ లైసెన్స్ సి-బుక్ పొల్యూషన్ తప్పనిసరిగా ఉండాలన్నారు. మితిమీరి వేగం వెళ్తే కేసులు తప్పవని హెచ్చరించారు. పరిమితికి మించిన ప్రేమికులను ఎక్కించరాదని, ఓవర్ లోడ్ వేయరాదని ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని అన్నారు. ఆయన వెంట కానిస్టేబుల్ రాంబాబు ఉన్నారు.

గిరిజన గ్రామాల్లో గడపగడపకు మన ప్రభుత్వం

కురుపాం : సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లుగా చూస్తూ ప్రభుత్వం పాలన సాగిస్తుందని స్థానిక ఎమ్మెల్యే పి.పుష్ప శ్రీవాణి అన్నారు. మండలంలోని నీలకంఠాపురం పంచాయతీలో గల గిరిజన గ్రామాల్లో శనివారం గడప గడపకు కార్యక్రమంలో భాగంగా ఇంటింటికి వెళ్లి ప్రభుత్వం నుండి అందిస్తున్న సంక్షేమ పథకాల గురించి ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ ఎ.మన్మథరావు, జెడ్‌పి వైస్‌చైర్మన్ మరిశర్ల బాపూజీ నాయుడు, ఎంపిపి శెట్టి పద్మావతి, జెడ్‌పిటిసి సభ్యులు జి.సుజాత, జిల్లా కో ఆప్షన్ సభ్యులు షేక్ నిసార్, మండల కన్వీనర్ ఐ.గౌరీ శంకర్, వైస్ ఎంపిపిలు బి.అన్నాజీరావు, రంగారావు, స్థానిక ఎంపిటిసిలు, సర్పంచులు, వైసిపి నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

మనస్థాపంతో యువకుడు ఆత్మహత్యాయత్నం

ప్రజాశక్తి- పార్వతీపురం రూరల్

జియ్యమ్మవలస మండలం బట్లభద్రకు అల్లు అశోక్ తన భార్య కాపురానికి రాలేదని మనస్తాపం చెంది శనివారం ఇంట్లో ఉన్న పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించాడు. గత కొద్దిరోజులుగా తనపై అలిగి భార్య తన పుట్టిల్లు పార్వతీపురం వెళ్లిపోవడంతో ఎన్నిసార్లు పిలిచినా ఆమె తిరిగి రాలేదు. అంతేకాక ఫోన్ చేస్తే సమాధానం ఇవ్వకపోవడంతో తీవ్ర మనస్థాపానికి గురై శనివారం తమ గ్రామంలో ఈ ఘటనకు పాల్పడినట్లు బంధువులు తెలిపారు.

480 లీటర్ల నాటు సారా సీజ్

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

ఒడిషా నుండి ఆంధ్రా ప్రాంతానికి నాటు సారా రవాణా జరుగుతుందన్న సమాచారంతో కొమరాడ మండలం నడిమివలస సమీపంలో వాహన తనిఖీలు చేపట్టి 480 లీటర్ల నాటు సారాతో పాటు నాలుగు ద్విచక్ర వాహనాలను సీజ్ చేసినట్లు స్పెషల్ ఇంఫోర్స్మెంట్ బ్యూరో సిఐ ఎల్ ఉపేంద్ర తెలిపారు. ఒడిషాలోని నాగుళ్లవలసకు చెందిన ఆరిక సూరి, కొమరాడ మండలం గుమడకు చెందిన రాయపల్లి పౌలును అదుపులోకి తీసుకుని విచారణ జరిపి గుమడ గ్రామానికి చెందిన మరో ఏడుగురు బొమ్మాళి రాజు, బంగారి జనని, బంగారి శకుంతల, వండాన గౌరు, రాగోలు చంద్రమౌళి, దేవుపల్లి రాజా, రాగొలు చిరంజీవిలను అరెస్ట్ చేసినట్లు తెలిపారు. ఈ కేసుకు సంబంధించి పరారీలో ఉన్న ఒడిషాకు చెందిన సురేష్, సింహాద్రి, బూర్జివలసకు చెందిన పీడక రవిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. ఎక్సైజ్ సిబ్బంది పాల్గొన్నారు.